నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, శనివారం 3 ఆగస్టు 2024 | NIZAMABAD




### బ్యాంకు వాళ్లదే తప్పు

కెనరా బ్యాంకు నుంచి 2022 లో లక్ష రూపాయల క్రాప్ లోన్ తీసుకున్న. సకాలంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం లోన్‌ను రెన్యువల్ కూడా చేయించుకున్న . కానీ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండో విడుత రుణమాఫీ జాబితాలో నాపేరు లేదు. నాకు రుణమాఫీ కాలేదు. రుణమాఫీ లిస్టులో నా పేరులేదు. దీనిపై అధికారులకు అడిగితే సరైన సమాచారం ఇస్తలేరు. బ్యాంకు అధికారుల తప్పిదంతోనే నాకు రుణమాఫీ కాలేదని తెలుస్తున్నది.

**-మద్దిపాటి ఉదయ్ భాస్కర్‌రావు, రైతు, దండిగుట్ట**



### లిస్టు ఇయ్యకనే మాఫీ రాలేదు

పోయిన ఏడాది బ్యాంకులో లక్షా పదివేల రూపాయల పంట రుణం తీసుకున్న. లోన్ తీసుకున్న రైతుల లిస్టును అధికారులు పట్టించుకోలే. సకాలంలో రెన్యువల్ కూడా చేయకపోవడం, ప్రామాణికంగా జాబితాను ప్రభుత్వానికి పంపకపోవడంతో రుణ మాఫీ కాలేదు. ఈ బ్యాంకుల ఖాతా తీసుకోవడంతోనే రుణమాఫీ వర్తించలేదేమో అని పిస్తున్నది. గవర్నమెంట్ చెప్పేదొకటి..చేసేది మరొకటిలా ఉంది. రుణమాఫీపై కచ్చితమైన క్లారిటీ ఇచ్చేవారే కరువయ్యారు.

**-గౌతమ్ కృష్ణారావు, రైతు, దండిగుట్ట**



### బ్యాంకు చుట్టూ తిరుగుడైతున్నది..

గీ సర్కారు రుణమాఫీ చేసిందని వారం రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్న. కొందరేమో వ్యవసాయాధికారులకు వెళ్లి అడగండి అని చెబితే వాళ్ల దగ్గరికి పోయి కూడా అడిగినా. నాకు రుణమాఫీ అయ్యింది.. కాలేదని ఎవరూ కచ్చితంగా చెప్పుతలేరు. గవర్నమెంటేమో అందరికీ రుణమాఫీ చేసినట్లు చెబుతున్నది. కానీ మాకు మాత్రం నిరాశే మిగిలేలా కనిపిస్తున్నది.

**-ఖేతావత్ మధుబాయి, దండిగుట్ట**

- అర్హులైన వేలాది మందికి వర్తించని రుణమాఫీ
- గందరగోళంగా మారిన ప్రభుత్వ పథకం
- బ్యాంకులు, అధికారుల చుట్టూ చక్కర్లు
- సరైన సమాచారం దొరకక రైతుల గగ్గోలు
- అన్నదాతల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం
- రెంజల్‌లో బ్యాంకు ఎదుట ధర్నా
- నామమాత్రంగా మారిన సహాయ కేంద్రాలు



బ్యాంక్ మేనేజర్‌తో రైతుల వాగ్వాదం

# రైతు గోడు.. వినేదెవరు?

నిజామాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రూ.లక్షన్నర లోపు రుణాలు మాఫీ చేసున్నామన్న ప్రభుత్వ ప్రకటనతో రైతాంగం సంబురపడింది. అయితే, రుణ విముక్తి లభించిందని సంబురపడిన అన్నదాతలకు ఊహించని షాక్ తగిలింది. జాబితాలో పేర్లు లేకపోవడం, రుణ ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో అవాక్కవడం రైతుల వంతవుతున్నది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ ప్రక్రియ అంతా అయోమయం.. గందరగోళంగా మారింది. లోన్ ఎందుకు మాఫీ కాలేదో అర్థం కాక రైతాంగం ఆందోళన చెందుతున్నది. అన్నదాత గోడు వినే వారు లేరు. గోస తీర్చే వారూ లేరు. పనులు మానుకుని బ్యాంకులు, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఆగ్రహానికి గురవుతున్న కర్షకులు ఆందోళనలకు దిగుతున్నారు. తాజాగా రెంజల్‌లోని కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టారు.

### నిర్లక్ష్యం..

అధికారుల అలసత్వం, బ్యాంకర్ల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది రైతులకు రుణ మాఫీ కాలేదు. అర్హులైన అన్నదాతలకు మాఫీ కాకపోవడం వెనుక జాబితాల రూపకల్పనలో తీవ్ర నిర్లక్ష్యం జరిగినట్లు రైతులు మండిపడుతున్నారు. మరోవైపు, రేషన్ కార్డు నిబంధన మూలంగా చాలా మందికి అన్యాయం జరిగిన ట్లు తెలిసింది. ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి వేరుగా జీవనం సాగిస్తున్న వారికి మాఫీ కాలేదు. కుటుంబంలోని అందరికీ రుణమాఫీ పొందేందుకు అర్హత ఉన్నా ఒకరి పేరిట ఉన్న లోన్‌ను మాత్రమే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడంతో మిగతా వారికి అన్యాయం జరిగింది.

### 'సహాయం' అంతంతే..

నిజామాబాద్ జిల్లాలో మొదటి విడుతలో 44,469 మంది రైతు కుటుంబాలకు సంబంధించి, రూ.225 కోట్లు, రెండో విడుతలో 22,868 మందికి సంబంధించి రూ.210 కోట్ల రుణాలను రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసింది. తొలి విడుతలో 517 ఫిర్యాదులు రాగా పరిష్కరించారు. రెండో విడుత వచ్చేసరికి సహాయక కేంద్రాలు నామమాత్రంగానే మారాయి. రైతులు ఫోన్ చేస్తుంటే పెద్దగా స్పందన ఉండడం లేదు. పదుల సార్లు ఫోన్లు చేసినా లైన్ కలవడం లేదంటూ నిట్టూరుస్తున్నారు.

## రుణమాఫీ కోసం బ్యాంకు ముట్టడి

- మూడు గంటల పాటు రైతుల ధర్నా
- జాబితా రూపకల్పనలో బ్యాంకర్ల నిర్లక్ష్యం
- మాఫీ వర్తించక నష్టపోయిన కర్షకులు
- బ్యాంకు ఎదుట బైఠాయించిన అన్నదాతలు

రెంజల్, ఆగస్టు 2: అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదు.. ఆఫీసులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా సమాధానం లేదు. కడుపు మండిన కర్షకులు బ్యాంకును ముట్టడించి మూడు గంటలకు పైగా ధర్నా చేశారు. రెంజల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది ఘటన. స్థానిక కెనరా బ్యాంకులో వేలాది మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. కొన్నేండ్లుగా క్రమం తప్పకుండా రెన్యూవల్ చేసుకుంటూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడుతల్లో కలిపి రూ.లక్షన్నర లోపు క్రాప్ లోన్లను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించడంతో తమకు రుణ బాధ తప్పిందని సంతోషపడ్డ రైతులకు ఊహించని షాక్ తగిలింది. జాబితాలో పేరు లేదు.. ఖాతా ల్లో డబ్బులు పడలేదు. ఆందోళనకు గురైన రైతులు ఆఫీసులు, బ్యాంకు చుట్టూ తిరిగినా సరైన సమాధానం లేదు. 15 రోజులుగా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడంటూ ఆగ్రహానికి గురైన వందలాది రైతులు శుక్రవారం కెనరా బ్యాంక్ ఎదుట బైఠాయించారు. రెంజల్, దండిగుట్ట, కూనేపల్లి, బాగేపల్లి, కల్యాపూర్, వీరన్నగుట్ట, అంబేద్కర్‌నగర్, కిసాన్ తండా తదితర గ్రా మాల రైతులు ధర్నాకు దిగారు. తమకు రుణమాఫీ ఎందుకు కా లేదో చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. రుణాలను తక్షణమే మాఫీ చేయాలని, లేకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామన్నారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అక్కడికి చేరుకొని అర్హులందరికీ న్యాయం చేస్తామని, రెండ్రోజులు గడువు ఇవ్వాలని కోరారు. శాంతించిన రైతులు.. గడువులోగా చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### రుణమాఫీ రానివారే ఎక్కువ..

రుణమాఫీ పథకంలో లబ్ధి పొందిన వారి కన్నా పొందని వారే ఎక్కువగా ఉన్నారు. రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న సన్న చిన్నకారు రైతులకు ప్రయోజనం దక్కలేదని తెలిసింది. కుటుంబాన్ని యూనిట్‌గా పరిగణించడం ద్వారా చాలా మంది అవకాశాన్ని కోల్పోయారు. గతంలో కేసీఆర్ సర్కారు ఉన్నప్పు డు రుణాల మాఫీలో ఇంతటి గందరగోళం లేదు. కేసీఆర్ హయాంలో చేపట్టిన రుణమాఫీ సమయంలోనూ ఇదే యంత్రాంగం పని చేసింది. ఇప్పుడున్న కలెక్టర్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులంతా వారే ఉన్నారు. కానీ ప్రభుత్వ కొర్రీల కారణంగా గందరగోళం ఏర్పడింది.మార్గదర్శకాల పేరు తో ఆంక్షలు పెట్టి మరీ చాలా మంది అర్హులైన రైతులను రుణమాఫీ వర్తించకుండా చేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

## పింఛన్ల పెంపుపై మాట నిలబెట్టుకోవాలి

- బీడీ కార్మికుల డిమాండ్
- మోర్తాడ్ తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా

మోర్తాడ్, ఆగస్టు 2: ఎలాంటి షరతులు లేకుండా తమకు రూ.4,016 పింఛన్ ఇవ్వాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఎంఎల్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మోర్తాడ్ తహసీల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి దేవరాం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా బీడీ కార్మికులందరికీ కటాఫ్‌డేట్‌తో సంబంధం లేకుండా రూ.4,016 జీవనభృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షల మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమను నాశనం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. బహుళజాతి కంపెనీలకు సబ్సిడీలు ఇస్తూ బీడీ పరిశ్రమపై పన్నులు పెంచి బీడీ పరిశ్రమను దెబ్బతీయడానికి కుట్రచేశారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు సత్తెక్క, ఆనంద్, బాలకిషన్, సారా సురేశ్, కిషన్, అశోక్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.




మోర్తాడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

## యువతను మోసం చేసిన కాంగ్రెస్

ఎమ్మెల్యే వేముల ధ్వజం



మోర్తాడ్, ఆగస్టు 2: ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎన్నికల ముందర యువతను వాడుకున్న కాంగ్రెస్ ఇప్పుడు దారుణంగా మోసగించిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ పేరిట జాబ్‌ల సంఖ్య లేని బోగస్ క్యాలెండర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా అసెంబ్లీలో విడుదల చేయడం నిరుద్యోగ యువతను మోసం చేయడమేనని ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. జాబ్ క్యాలెండర్‌పై సభలో చర్చ జరపాలని కోరితే తేదీలు ప్రకటించి తప్పించుకున్న ప్రభుత్వానికి యువత బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 1.63 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందన్న వేముల.. తాము వేసిన నోటిఫికేషన్లు, నిర్వహించిన పోటీ పరీక్షల ఫలితాలకు సంబంధించిన నియామకపత్రాలు ఇచ్చి మంది బిడ్డ మాబిడ్డ అని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్నది ఎద్దేవా ఎన్నికలకు ముందు అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఉస్మానియా యూనివర్సిటీలోని యువకులను, నిరుద్యోగులను రెచ్చగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి సంవత్సరమే 2లక్షల ఉద్యోగాలతో కూడిన జాబ్‌క్యాలెండర్ రిలీజ్ చేస్తామని నమ్మించారన్నారు. ఎన్నికల్లో ఊరూరా తిప్పి పార్టీ గెలుపు కోసం వాడుకుని ఇప్పుడు నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం కూడ ఇవ్వలేదన్నారు. ఓట్ల కోసం నిరుద్యోగ యువతను వాడుకున్న రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఓయూకు వచ్చి యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



### ముందస్తు అరెస్టు

**తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు** చెల్లించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో గాంధారి, పెద్దకొడప్‌గల్, లింగంపేట మండలాలకు చెందిన మాజీ సర్పంచులు ఉన్నారు. -గాంధారి/ పెద్దకొడప్‌గల్/ లింగంపేట, ఆగస్టు 2



### తీజ్

**డిచ్‌పల్లి మండలంలోని** నాక తండాలో శుక్రవారం తీజ్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. యువతులు గోధుమ బుట్టలను ఎత్తుకుని తండా పోలిమేర వరకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-డిచ్‌పల్లి, ఆగస్టు 2

## బతికుండగానే చంపేశారు!

- ఫేక్ డెత్ సర్టిఫికెట్‌తో ప్లాట్ రిజిస్ట్రేషన్
- కామారెడ్డిలో వెలుగు చూసిన ఘటన
- ముగ్గురు నిందితుల అరెస్టు

కామారెడ్డి రూరల్, ఆగస్టు 2: బతికున్న వ్యక్తి చనిపోయినట్లు ఫేక్ సర్టిఫికెట్ సృష్టించి దొంగతనంగా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసిన కేసులో కామారెడ్డి పోలీసులు.. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నివాసముండే నరాల జీవన్‌రెడ్డికి అశోక్‌నగర్ కాలనీలో 200 గజాల ప్లాట్ ఉంది. అయితే, గత నెల 26న ఆ ప్లాట్‌ను మహ్మద్ సాజిద్ హుస్సేన్ ట్రాక్టర్‌తో చదును చేసేందుకు రాగా, విషయం తెలుసుకున్న జీవన్‌రెడ్డి అక్కడికి వెళ్లాడు. నా ప్లాట్‌ను ఎందుకు చదును చేయిస్తున్నావని ప్రశ్నించగా, నిజామాబాద్ వాసి అబ్దుల్ మోసి ఈ ప్లాట్‌ను కొనుగోలు చేశాడని, అందుకు సంబంధించిన కొన్ని పత్రాలను చూయించాడు. 2012లోనే ప్లాట్ ఓనర్ జీవన్‌రెడ్డి చనిపోయినట్లు ఫేక్ డెత్ సర్టిఫికెట్ సృష్టించి, ఆయన కుమార్తె బగ్గల స్రవంతి సెల్ఫ్ అఫిడవిట్ ద్వారా కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసిన సేల్ డీడ్ డాక్యుమెంట్ చూసి జీవన్‌రెడ్డి షాకయ్యాడు. తాను చనిపోయినట్లు తప్పుడు పత్రాలు సృష్టించడంతో పాటు తన కూతురి స్థానంలో వేరొకరిని తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేయించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని జీవన్‌రెడ్డి కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ వ్యవహారంతో సంబంధమున్న మహమ్మద్ అబ్దుల్ మోసి, స్రవంతి, మహ్మద్ నబిని అరెస్టు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు.

### సంబురాలు



పెద్ద కొడప్‌గల్‌లో సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ సభ్యులు

**ఎస్సీ వర్గీకరణపై** సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఉమ్మడి జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం వివిధ మండలాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ సంఘాల ప్రతినిధులు సంబురాలు జరుపుకొన్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. బైక్ ర్యాలీలు, అంబేద్కర్ విగ్రహాలకు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.








ఎల్లారెడ్డి నుంచి సీఎం సభకు తరలివెళ్తున్న ఉపాధ్యాయులు

## టీచర్లు సిటీకి.. పిల్లలు గాలికి..

**బదిలీలు, ఉద్యోగోన్నతులు** పొందిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తరలివెళ్లడంతో విద్యార్థులకు తరగతుల నిర్వహణ నామమాత్రంగా కొనసాగింది. బోధన్ పట్టణంలోని రాకాసీపేట్, రెంజల్ మండలం కందుకుర్తి, బీబీపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో కొందరు విద్యార్థులు తరగతి గదుల్లో ఖాళీగా కూర్చోగా.. మరికొందరు మైదానంలో ఆడుతూ కనిపించారు.

-శక్కర్‌నగర్/రెంజల్/బీబీపేట్, ఆగస్టు 2



బీబీపేట్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక వరండాల్లో ఆడుకుంటున్న విద్యార్థులు